సాక్షి అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం ; 28 ; డిసెంబర్ ; 2024



విద్యుత్ శాఖ ఏడీఈ సురేష్‌కు వినతి పత్రం అందజేస్తున్న అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం, ఎమ్మెల్సీ రవిబాబు, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ సుభద్ర, పార్టీ నాయకులు



పాడేరులో విద్యుత్ పంపిణీ సంస్థ ఎస్ఈ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు,అరకు మాజీ ఎంపీ మాధవి, పాడేరు మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి,వైఎస్సార్‌సీపీ నేతలు

విద్యుత్ చార్జీలపెంపుపై ప్రజలు భగ్గుమన్నారు. నడ్డి విరిచేలా మోపిన భారాన్ని దింకపోతే ఖబడ్దార్ అంటూ కన్నెర్ర చేశారు. వారికి వైఎస్సార్‌సీపీ అండగా నిలిచింది. వైఎస్సార్‌సీపీ పోరుబాటతో జిల్లా హోరెత్తింది.విద్యుత్ చార్జీల బాదుడికి నిరసనగా శుక్రవారం జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో నిర్వహించిన ఆందోళనల్లో భారీ సంఖ్యలో ప్రజలు, నాయకులు పాల్గొన్నారు. నినాదాలతో హోరెత్తిస్తూ ర్యాలీలు నిర్వహించి, విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నా చేశారు. చార్జీలు తగ్గించాలని కోరుతూ సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కూటమి ప్రభుత్వ ఆరు నెలల పాలనను ఎండగడుతూ వైఎస్సార్ సీపీ చేపట్టిన ఈ నిరసన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష మద్దతు లభించింది.



పాడేరులో ర్యాలీ నిర్వహిస్తున్న పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, అరకు మాజీ ఎంపీ మాధవి,పాడేరు మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి,వైఎస్సార్‌సీపీ నేతలు



భారం దించకపోతే.. ఖబడ్దార్

సాక్షి,పాడేరు: ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీఇచ్చిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తరువాత భారీగా పెంచి ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు,పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం యూనిట్‌కు రూ.2.19 చొప్పున విద్యుత్ చార్జీలు పెంచడాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన వైఎస్సార్‌సీపీ పోరుబాటలో భాగంగా జిల్లా కేంద్రం పాడేరులో శుక్రవారం పార్టీ శ్రేణులు, ప్రజలు భారీ ఎత్తున ఆందోళన చేశారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ అధ్యక్షుడు,ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు తన క్యాంపు కార్యాలయం నుంచి నేతలు, కార్యకర్తలు,గిరిజనులతో కలిసి సినిమాహాల్ సెంటర్, పాతపాడేరు, కాన్వెంట్ జంక్షన్ మీదుగా కొత్త పాడేరు సమీపంలోని విద్యుత్ పంపిణీ సంస్థ ఎస్ఈ కార్యాలయం వరకు రెండు కిలోమీటర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్ఈ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు.ఎస్ఈతో పాటు ఇతర అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచడం అన్యాయమన్నారు. ఎన్నికలకు ముందు హామీలు ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ప్రజలకు వెన్నుపోటు పొడిచారని మండిపడ్డారు.విద్యుత్ చార్జీలను పెంచడంతో పాటు సూపర్ సిక్స్ హామీలను విస్మరించిన సీఎం చంద్రబాబుకు ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ప్రజలు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

ప్రజలపై విద్యుత్ భారం దారుణం : మాజీ ఎంపీ మాధవి మాట్లాడుతూ ప్రజలపై విద్యుత్ చార్జీలభారం మోపడం దారుణమన్నారు.రెండు నెలల వ్యవధిలో విద్యుత్ చార్జీలు పెంచి అన్ని వర్గాల ప్రజలకు సీఎం చంద్రబాబు అన్యాయం చేస్తున్నారని,విద్యుత్ చార్జీల రూపంలో రూ.1,550 కోట్లు ప్రజలపై భారం వేయడం తగదన్నారు. సంపద సృష్టిస్తానని చెప్పి ప్రజలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వానికి తొందరలోనే గుణపాఠం తప్పదని ఆమె హెచ్చరించారు.

ప్రభుత్వమే భరించాలి : వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షురాలు,పాడేరు మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రెండు నెలల వ్యవధిలో రూ.15,400 కోట్ల మేర ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపిందని, దీనిని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు.తమ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంక్షేమ పథకాలతో లబ్ధిపొందారని, ఎన్నికలకు ముందు బూటకపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై అలుపెరగని పోరాటాలు చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర,మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కురుసా పార్వతమ్మ,పాడేరు మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు,కొయ్యూరు, జీకే వీధి ఎంపీపీలు రమేష్,కుమారి, జీకే వీధి జెడ్పీటీసీ కిముడు శివరత్నం,పాడేరు, వైస్ ఎంపీపీ కనకాలమ్మ,పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కూడా సురేష్‌కుమార్,ఎంపీటీసీలు గిడ్డి విజయలక్ష్మి,చల్లా చిట్టమ్మ, లకే రామకృష్ణపాత్రుడు,నరసింహమూర్తి ,మీనా, సర్పంచ్‌లు సీదరి రాంబాబు, బసవన్నదొర,హనుమంతరావు,లక్ష్మణరావు,పార్టీ సీనియర్ నాయకులు లకే రామసత్యవతి,ఐశ్వర్యరాణి,కన్నాపాత్రుడు,సూర్యనారాయణ,సత్యనారాయణ,సుబ్రహ్మణ్యం,మత్స్యకొండబాబు,పాడేరు నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు కార్యకర్యలు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించే వరకూ

పోరాడతాం



విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా అరకులోయలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మత్స్యలింగం, ఎమ్మెల్సీ రవిబాబు, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ సుభద్ర, పార్టీ నాయకులు

అరకులోయటౌన్: పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించే వరకు పోరాడతామని వైఎస్సార్‌సీపీ అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ జల్లిపల్లి సుభద్ర తెలిపారు. విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా వైఎస్సార్‌సీపీ పోరుబాట కార్యక్రమంలో భాగంగా అరకులోయలోని ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం క్యాంప్ కార్యాలయం నుంచి గ్రీన్ వ్యాలీ, ప్రధాన రహదారి మీదుగా విద్యుత్ శాఖ ఏడీఈ కార్యాలయం వరకు శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించి, ఏడీఈ సురేష్, ఏఈఈ సత్యనారాయణలకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చిన కూటమి నేతలు గద్దెనెక్కిన తరువాత ప్రజలను మోసం చేశారని, తగ్గింపు హామీని విస్మరించడమే కాకుండా రెండు సార్లు విద్యుత్ చార్జీలు పెంచి సామాన్య ప్రజలపై రూ.15 వేల కోట్ల భారాన్ని మోపారన్నారు. ఇప్పటికే రూ.6,072 కోట్లను ప్రజల వద్ద నుంచి ముక్కుపిండి వసూలు చేశారన్నారు. జనవరి నుంచి 9,412 కోట్ల భారం మోపనున్నారని చెప్పారు. సూపర్ సిక్స్ హామీల్లో ఏ ఒక్క దానిని సక్రమంగా నెరవేర్చలేదని చెప్పారు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించే వరకు వైఎస్సార్‌సీపీ పోరాడుతుందని తెలిపారు. ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చంద్రబాబునాయుడు రాష్ట్రమంతా తిరిగి జగన్‌మోహన్ రెడ్డి విద్యుత్ చార్జీలు అధికంగా పెంచారని, తాము అధికారంలోకి వస్తే పైసా కూడా పెంచమని, పెంచిన చార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత హామీని విస్మరించి ఆరు నెలల్లో రెండు సార్లు భారం మోపారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా అందించామని, ఆ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రప్రజలపై అప్పుల భారం మోపడమేనా సంపద సృష్టి అంటే అని ప్రశ్నించారు.

ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు మరో సారి మోసపోయారని చెప్పారు. మాట తప్పడం చంద్రబాబు నైజమన్నారు. విద్యుత్ చార్జీలుపెంచబోమని, సంపద సృష్టిస్తామని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు వినియోగదారులపై అధిక భారం మోపారని చెప్పారు. ప్రతి గడపకు వెళ్లి కూటమి ప్రభుత్వ బూటకపు హామీల గురించి తెలియజేస్తామని చెప్పారు. విద్యా దీవెన, వసతి దీవెనలు లేక విద్యార్థులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. రానున్న రోజుల్లో విద్యార్థుల ఆందోళనలు తప్పవని, ప్రభుత్వాన్ని గద్దెదించే రోజులు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీలు శెట్టి రోషిణి, చటారి జానకమ్మ, ఎంపీపీలు ఆర్.ఉషారాణి, శెట్టి నీలవేణి, బాక ఈశ్వరి, పి.సీతమ్మ, వైస్ ఎంపీపీ రామన్న, ఆనంద్, పార్టీ మేధావి వింగ్ జిల్లా అధ్యక్షుడు రాజరమేష్ బోస్, పార్టీ మండలాల అధ్యక్షులు లక్ష్మణ్‌కుమార్, మల్లేశ్వరరావు, పద్మారావు, స్వామి, పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి చిన్నారావు, జిల్లా కార్య శెట్టి అప్పాలు, పార్టీ నాయకుడు కమిడి అశోక్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కిరణ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నర్సింగరావు, సర్పంచ్‌లు రమేష్, రాధిక, జ్యోతి, నీలకంఠం, కళావతి, ఎంపీటీసీ ఆనంద్, శత్రుఘ్న, స్వచ్ఛంద కార్పొరేషన్ చైర్మన్ సోమేశ్వరి, పార్టీ నాయకులు విజయ్‌కుమార్, ఎం.టి.ఆర్,సాంబ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన కూటమి

పోరుబాట కార్యక్రమంలో ఎమ్మెల్సీ అనంతబాబు, మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి

రంపచోడవరం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ ఆరు నెలల కాలంలో ఒక్క సంక్షేమ పథకాన్ని అమలు చేయలేదని, ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్(అనంతబాబు), మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మిలు అన్నారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో పాల్గొన్న కార్యకర్తలు, నాయకులు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులతో కలిసి పందిరిమామిడి నుంచి ర్యాలీగా విద్యుత్ సబ్ స్టేషన్‌కు చేరుకుని పెద్ద ఎత్తున ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాల అమలు చేశారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా చంద్రబాబు నాయుడు చేతులెత్తాశారని విమర్శించారు.

తొమ్మిది గంటల పాటు ఉచిత విద్యుత్ ఇస్తామన్నారని, దాని ఊసే ఎత్తడం లేదని చెప్పారు.2014లో చంద్రబాబు అబద్ధాలతో ప్రజలు మోసపోయారని, ఇప్పుడు అదే పరిస్థితిలో ఉన్నారని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే భర్త అరాచాకలకు అంతులేకుండా ఉందని ఆరోపించారు. పేద ఎమ్మెల్యే అని చెబుతున్నారని, ఆరు నెలల కాలంలో ఇంటి ముందు ఐదు ఖరీదైన కార్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. గిరిజనులు విద్యుత్ బిల్లులు కట్టలేని పరిస్థితిలో ఉన్నారని, ఒక బల్బు, ఫ్యాన్ ఉంటే రూ. 15వేలు, రూ. 20 వేలు కరెంటు బిల్లులు వచ్చాయని చెప్పారు. అనంతరం ఏపీఈపీడీసీఎల్ డీఈ గాబ్రియేల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీలు ఆనంద్ రెడ్డి, సార్ల లలితకుమారి, కుంజం మురళీ, గోము వెంకటలక్ష్మి, పల్లాల కృష్ణారెడ్డి, వీరాఘవమ్మ, జెడ్పీటీసీ పండా వెంటకలక్ష్మి, సిరసం కృష్ణవేణి, కర్ర వెంకటలక్ష్మి, మద్దాల వీర్రాజు, చిచ్చడి మురళీ,గుజ్జ విజయ, స్థానిక సర్పంచ్ మంగా బొజ్జయ్య, ఎంపీటీసీలు, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పోరుబాట కార్యక్రమంలో విద్యుత్ సబ్ స్టేషన్‌కు ర్యాలీగా వెళుతున్న ఎమ్మెల్సీ అనంతబాబు, మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి

రూ .3 వేల బిల్లు వచ్చింది



మాఇంటికి ఒకే బల్బు ఉంది. కరెంటు బిల్లు రూ.3వేలు వచ్చింది. ఇంత ఎక్కువ బిల్లు వస్తే నేను కట్టే పరిస్థితి లేదు. ఒక వైపు విద్యుత్ చార్జీలు పెంచుతూ మరో వైపు అధికంగా బిల్లులు వేస్తున్నారు. ఎప్పుడు ఇంతింత బిల్లులు రాలేదు. మేం ఎలా కట్టాలి.

–కొండ్ల చెల్లాయమ్మ, వై.రామవరం

రూ. 200 బిల్లు వచ్చేది...



ఇంతకు ముందు మా ఇంటికి కరెంటు బిల్లు రూ. 200 వచ్చేది. ఇప్పుడు రూ. 2 వేలు వచ్చింది. ఇంత ఎక్కువగా బిల్లు వస్తే ఎలా కట్టగలం. గత ప్రభుత్వంలో గిరిజనులకు అన్ని రకాలుగా మేలు చేశారు. ఈ ప్రభుత్వంలో బాదుడు మొదలైంది.

–గౌరమ్మ, అడ్డతీగల

మోసం చేసిన కూటమి ప్రభుత్వం



ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలను తగ్గిస్తామని ప్రకటించిన కూటమి నేతలు, అధికారంలోకి ఇచ్చిన తరువాత మోసం చేసి, చార్జీలను భారీగా పెంచి సామాన్యుల నడ్డి విరిచారు. ఇది అన్యాయం. వెంటనే పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలి.

– గణేశ్వరావు, రాసవీధి గ్రామం.

కరెంట్ చార్జీల పెంపు అన్యాయం



సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని ఎన్నికల్లో ఊదరగొట్టిన చంద్రబాబు అధికార పీఠంలో కూర్చున్నాక వాటి అమలుకు చర్యలు తీసుకోవడం లేదు. ఏ ఒక్క హామీని ఇంతవరకూ నెరవేర్చలేదు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో రెండు సార్లు కరెంట్ చార్జీలు పెంచడం దారుణం.

– శెట్టి గోపాల్, గిరిజనుడు, మాదల గ్రామం, అరకులోయ మండలం.

పెంచిన చార్జీలను తగ్గించాలి



పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలి. గతంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ విపరీతంగా విద్యుత్ చార్జీలు పెంచేసిందని, తాము అధికారంలోకి వస్తే పైసా కూడా పెంచబోమని ప్రజలను మభ్యపెట్టి, అధికారం చేజిక్కించుకుని కూటమి నాయకులు మోసం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కరెంట్ చార్జీలను పెంచి సామాన్యులపై పెను భారం మోపారు.

– బస్కీబారికి సొర్రు, రిటైర్డ్ ఉద్యోగి, అరకు , దుంబ్రిగుడ మండలం

పర్యాటకుల మదిని దోచేలా అల్లూరి పార్క్ సుందరీకరణ



సుందరీకరణ పూర్తయిన కొలను (ఇన్‌సెట్) అల్లూరి విగ్రహం



చింతపల్లిలో అల్లూరి దాడిచేసిన పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న కేంద్ర సాంస్కృతిక శాఖ జాయింట్ సెక్రటరీ ఉమ, ఐటీడీఏ పీవో అభిషేక్

కొయ్యూరు: విప్లవం రూపం దాలిస్తే సరిగ్గా ఇలానే ఉంటుంది...ధైర్యం ఆకారాన్ని సంతరించుకుంటే ఇలా నిండైన విగ్రహంగా మారుతుంది. అలాంటి విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అకుంఠిత త్యాగదీక్ష, సచ్ఛీలత,ఏకాగ్రత మనముందు ఆవిష్కరింపజేసేలా కేంద్రప్రభుత్వ నిధులతో చేపట్టిన అల్లూరి స్మారకపార్క్ సుందరీకరణ పనులు ఆకట్టుకుంటున్నాయి. మంపలో అల్లూరి పట్టుబడిన కొలనును ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. దీనిని శుక్రవారం పరిశీలించిన కేంద్ర సాంస్కృతిక శాఖసంయుక్తకార్యదర్శి నండూరి ఉమ సంతృప్తి వ్యక్తం చేశారు.కొలను మధ్యలో ధ్యాన్య ముద్రలో ఏర్పాటు చేసిన అల్లూరి విగ్రహం అందర్నీ ఆకట్టుకుంటోంది. ధ్యానముద్రలో ఉన్న అల్లూరి విగ్రహాన్ని మొదటిసారి ఇక్కడే చూశానని ఉమ తెలిపారు.దీంతో పాటు పర్యాటకులను ఆకర్షించేలా కొలనుచుట్టూ సిమెంట్‌తో ఎత్తైన గట్టును ఏర్పాటు చేశారు. నలువైపులా అల్లూరి చరిత్రను తెలిపే చిత్రాలను గోడలపై ఏర్పాటు చేస్తున్నారు. అల్లూరి స్మారక స్తూపాన్ని కూడా తీర్చిదిద్దనున్నారు.

అల్లూరి చరిత్ర భావితరాలకు తెలిసేలా...

చింతపల్లి : అల్లూరి సీతారామరాజు తిరుగాడిన నేలగా ప్రత్యేక గుర్తింపును సంతరించుకున్న మన్యంలోని ప్రాంతాలన్నింటినీ పర్యాటకంగా అభివృద్ధి చేయనున్నట్టు కేంద్ర సాంస్కృతిక విభాగం జాయింట్ సెక్రటరీ ఉమ అన్నారు. ఆమె శుక్రవారం ఐటీడీఏ పీవో అభిషేక్‌తో కలసి చింతపల్లి, కొయ్యూరు, కృష్ణదేవీపేట ప్రాంతాల్లో పర్యటించి, అక్కడ అల్లూరి స్మారకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అల్లూరి చరిత్ర భావి తరాలకు తెలిసేలాప్రత్యేక పర్యాటకప్రాజెక్టులను అమలు చేసి అందులో వీటిని చేర్చాలని సూచించారు. మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు, క్షత్రియ పరిషత్ విభాగం నాయకులు నానిరాజు, రఘు పాల్గొన్నారు.

నిరసనలో ఉద్రిక్తత

- పాడేరు ఐటీడీఏ వద్ద ఎస్ఎఫ్ఐ, మహిళా సంఘాల ఆందోళన
- అరెస్టు చేసిన పోలీసులు
- ఏఎస్ఐ తీరుపై మహిళల మండిపాటు

పాడేరు: గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థి అదృశ్యం, మృతి చెందిన ఘటనలో బాధ్యులను అరెస్టు చేయాలని, మృతుడి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పాడేరు ఐటీడీఏ ఎదుట బాధిత కుటుంబ సభ్యులు, వారికి మద్దతుగా ఎస్ఎఫ్ఐ, పలు మహిళా సంఘాలు చేపట్టిన నిరసన కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. ఆందోళన చేస్తున్న వారిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే కొయ్యూరు గిరిజన గురుకుల ఆశ్రమ పాఠశాలలో టెన్త్ చదువుతున్న వంతాల మనోజ్ అనే విద్యార్థి ఇటీవల అదృశ్యమై, ఈనెల 25న చెరువులో శవమై తేలాడు. న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అయితే ఆ హామీని అమలు చేయకపోవడంతో మృతిచెందిన విద్యార్థి కుటుంబ సభ్యులు, విద్యార్థి సంఘాల నాయకులు శుక్రవారం పాడేరు ఐటీడీఏ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. సుమారు గంటన్నర పాటు ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ముందస్తు సమాచారం లేకుండా ఆందోళన కార్యక్రమం చేపడుతున్నారని నిరసనకారులపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. తమకు న్యాయం చేయాలని నినాదాలు చేస్తున్న మృతుడి తండ్రి సత్యనారాయణ, ఎస్ఎఫ్ఐ, మహిళ సంఘాల నేతలను పోలీసులు అరెస్టు చేసి, జీపులో ఎక్కించి స్టేషన్‌కు తరలించారు. పలువురు మహిళలపై ఏఎస్ఐ సాయి అనుచితంగా ప్రవర్తించారని బాధిత మహిళలు ఆరోపించారు. ఈవిషయంపై కలెక్టర్ స్పందించి తమకు న్యాయం చేయాలని, మహిళలపై అనుచితంగా ప్రవర్తించిన ఏఎస్ఐ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



ఐటీడీఏ వద్ద ప్రధాన రహదారిపై బైఠాయించిన విద్యార్థి తల్లిదండ్రులు, ఎస్ఎఫ్ఐ, మహిళా సంఘాల నేతలు



మహిళపై దురుసుగా ప్రవర్తిస్తున్న పోలీసు అధికారి

పారదర్శకంగా అంగన్‌వాడీ పోస్టుల భర్తీ

రంపచోడవరం: కొత్తగా మంజూరైన అంగన్‌వాడీ పోస్టులను పారదర్శకంగా భర్తీ చేయనున్నట్టు సబ్ కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ తెలిపారు. వై.రామవరం,అడ్డతీగల,గంగవరం,మారేడుమిల్లి,రాజవొమ్మంగి మండలాల్లో మంజూరైన 39 పోస్టుల భర్తీపై సబ్‌కలెక్టర్ శుక్రవారం ఐసీడీఎస్ సీడీపీవోలు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 31 వరకు పోస్టుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

క్లుప్తంగా

జాతీయ వాలీబాల్ పోటీలకు గిరిజన విద్యార్థిని


లక్ష్మీ

చింతపల్లి: జాతీయ వాలీబాల్ పోటీలకు స్థానిక డిగ్రీ కళాశాలలో బి.ఎ.తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి తెలిపారు. ఇటీవల కేరళలో అంతరాష్ట్ర కళాశాలల వాలీబాల్ పోటీలు నిర్వహించినట్టు చెప్పారు. ఆ పోటీల్లో కళాశాలకు చెందిన లక్ష్మీ పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో జాతీయ పోటీలకు ఎంపికై నట్టు తెలిపారు. గత 15 ఏళ్లలో జాతీయ పోటీలకు తొలిసారిగా కళాశాల నుంచి ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వచ్చే ఏడాది మేలో జరగనున్న జాతీయ పోటీల్లో పాల్గొననున్నట్టు తెలిపారు. జాతీయ పోటీలకు ఎంపికైన లక్ష్మిని కళాశాల అధ్యాపకులు జగదీష్, రవీంద్రనాయక్, లీలాపావని, కెజియారాణి తదితరులు అభినందించారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు


వెలగలపాలెంలో రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న డిప్యూటీ కలెక్టర్ జాన్‌రాజు, ఆర్‌ఐ చెల్లమ్మ

రాజవొమ్మంగి: పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవచ్చని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జాన్‌రాజు రైతులను కోరారు. ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండలంలోని మర్రిపాలెం, వెలగలపాలెం గ్రామాల్లో శుక్రవారం జరిగిన రెవెన్యూ సభలకు హాజరై రైతులను నుంచి అర్జీలు స్వీకరించారు. మ్యుటేషన్లు, ఈ-పాస్ బుక్స్ కోసం భూ యజమానుల నుంచి 13 అర్జీలువచ్చినట్టు చెప్పారు. పెద్ద ఎత్తున రైతులు ఈ సభలకు హాజరయ్యారు. సర్పంచ్‌లు దాసరి నాగేశ్వరరావు, సవిరెల చంద్రుడు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎస్.చెల్లమ్మ, వీఆర్వో నాగేశ్వరరావు, సర్వేయర్ శివ తదితరులున్నారు.

డ్వాక్రా మేళా.. అదిరే..

- వనంధైన ఉత్పత్తులతో అదరగొడుతున్న మహిళా సంఘాలు

ఎంవీపీకాలనీ: సంక్రాంతి సమీపిస్తున్న వేళ ఎక్కడ చూసినా షాపింగ్‌ల సందడే. ఆ పండగ వాతావరణాన్ని మరింత ఇనుమడింపజేస్తూ జీవీఎంసీ, మెప్మా ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా మైదానంలో ఏర్పాటు చేసిన డ్వాక్రా మేళాకు విశేష స్పందన లభిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో 100 స్టాళ్ల ద్వారా ఉత్పత్తులను నగర ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ నెల 29 వరకు ఈ మేళా కొనసాగుతుందని, నగర ప్రజలు వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు.


సందర్శకులతో కిటకిటలాడుతున్న స్టాల్స్, స్టాల్స్ తిలకిస్తున్న మహిళలు

బంగారాన్ని మరపించేలా..

బంగారాన్ని మరపించే విధంగా సింహాచలానికి చెందిన సాయిగణేష్ జ్యూయలరీ పేరిట మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్‌లో పచ్చల రాళ్లు పొదిగిన ఉంగరాలు, పచ్చల హారాలు, కడియాలు, బ్రాస్లెట్స్, చెవి కమ్మలు అందుబాటులో ఉంచారు. పంచలోహాల్లో వినియోగించే మెటల్స్‌తో వీటిని తయారు చేయడంతో వీటి రంగు మారే అవకాశం లేదని నిర్వాహకులు వెల్లడించారు. రూ.200 నుంచి రూ.1000 ధరలో వీటిని విక్రయిస్తున్నారు. గోల్డ్ కోటెడ్ సిల్వర్ ఉత్పత్తులు, మ్యారేజ్ సెట్స్, సిల్వర్‌పై గోల్డ్ కోటింగ్‌తో తయారు చేసిన రుద్రాక్షమాలలతో పాటు రూ.100 నుంచి రూ.20,000 వరకు విలువచేసే ఉత్పత్తులు విక్రయానికి ఉంచారు.



స్పందన బాగుంది

- కేంద్ర అర్బన్ అఫైర్స్ జాయింట్ సెక్రటరీ రాహుల్ కపూర్

డ్వాక్రా ఉత్పత్తుల మేళాకు విశాఖ ప్రజల స్పందన చాలా బాగుందని మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ జాయింట్ సెక్రటరీ రాహుల్ కపూర్ అన్నారు. ఏపీ మెప్మా ఎండీ ఎన్.తేజ్ భరత్‌తో కలసి ఆయన మేళాను సందర్శించారు. ప్రతి స్టాల్‌కు వెళ్లి కొనుగోళ్ల వివరాలు, నగర వాసుల స్పందనను తెలుసుకోవడంతో పాటు ప్రదర్శనలో ఉంచిన ఉత్పత్తులను ఆసక్తిగా తిలకించారు. రాహుల్ కపూర్ మాట్లాడుతూ ఎస్‌హెచ్‌జీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా దేశవ్యాప్తంగా ఈ మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశాఖ నగర ప్రజల నుంచి మేళాకు విశేష స్పందన రావడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, మెప్మా ఎండీ తేజ్ భరత్‌తో కలిసి సే నో టూ ప్లాస్టిక్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ 25న ప్రారంభమైన మేళా ఇప్పటి వరకు రూ.27 లక్షల కొనుగోళ్లు సాధించిందన్నారు. ఈ నెల 29 వరకు మేళా విజయవంతంగా కొనసాగుతుందన్నారు. అనంతరం రాహుల్ కపూర్, మెప్మా ఎండీలను సత్కరించారు. జీవీఎంసీ యూసీడీ పీడీ సత్యవేణి పాల్గొన్నారు.


మేళాలో స్టాల్ సందర్శిస్తున్న రాహుల్ కపూర్

నేచురల్ మిల్లెట్స్



బొబ్బిలి ఎంపీఎస్ గ్రూపునకు చెందిన మహిళలు విక్రయిస్తున్న 9 రకాల చిరుధాన్యాలకు వినియోగదారుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. సహజ సిద్ధంగా పండించిన వీటిని సేకరించి మార్కెట్ చేస్తున్నారు. దీంతో పాటు సిద్ధ సన్నాలు, మైసూర్ మల్లిక, బ్రౌన్ రైస్, బ్లాక్ రైస్ తదితర రైస్ ఉత్పత్తులను వీరు విక్రయిస్తున్నారు. అరకేజీ మిల్లెట్ ప్యాకెట్లు రూ.60, కేజీ ప్యాకెట్లు రూ.120 కి విక్రయిస్తున్నారు.

వావ్.. చాక్లెట్ బొకేస్



సీతంపేట శ్రీ వంశీకృష్ణ గ్రూపునకు చెందిన మహిళలు తయారు చేసిన హోం మేడ్ చాక్లెట్ ఉత్పత్తులు వినియోగదారుల ప్రశంసలు అందుకుంటున్నాయి. హోం మేడ్ చాక్లెట్స్‌తో పాటు చాక్లెట్ బొకేలను ఈ గ్రూప్ సభ్యులు విక్రయిస్తున్నారు. ప్రత్యేక తయారీ సామగ్రిని దిగుమతి చేసుకుని వీటిని తయారు చేస్తున్నారు. చాక్లెట్ బొకేలు రూ.1,000 నుంచి రూ.1,500 వరకు అందుబాటులో ఉన్నాయి.

మంగళగిరి.. న్యూలుక్

మంగళగిరి కాటన్స్ ఉత్పత్తిదారులు నేరుగా నిర్వహిస్తున్న స్టాల్‌లో పట్టు చీరలు, కలంకారీలో అనేక కొత్త ఉత్పత్తులను అందుబాటులో ఉంచారు. ఫ్యాన్సీ కలంకారీ శారీస్, టస్సర్ మెటీరియల్, నిజాం బోర్డర్, రుద్రాక్ష బోర్డర్ చీరలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. దీంతో పాటు అరటినారతో తయారు చేసిన చీరలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. రూ.1500 నుంచి రూ.3000 వేల వరకు చీరలు అందుబాటులో ఉన్నాయి.



నోరూరించే పచ్చళ్లు



భీమిలికి చెందిన ఉషోదయ డ్వాక్రా గ్రూప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రుచికరమైన పచ్చళ్లు వినియోగదారులకు నోరూరిస్తున్నాయి. అపోలో ఫిష్, ప్రాన్స్, చికెన్, ఎగ్ పచ్చళ్లతో పాటు అన్ని రకాల వెజ్ పచ్చళ్లు అందుబాటులో ఉంచినట్లు నిర్వాహకులు తెలిపారు. 3 నెలల వరకు నిల్వ ఉండేలా వీటిని సిద్ధం చేసినట్లు చెప్పారు. అర కేజీ బాక్స్‌లలో అపోలో ఫిష్ పచ్చడి రూ.400, చికెన్ రూ.450, ప్రాన్స్ రూ.700లకు విక్రయిస్తున్నారు.

సహజ 'పరిమళం'



ఆఫీస్, కార్యాలయం, ఇల్లు.. ఆలా చోటు ఏదైనా పరిమళాన్ని వెదజల్లే ఫ్రాగ్రెన్స్‌ను శ్రీ సాయి కిరణ్ గ్రూప్ సభ్యులు విక్రయిస్తున్నారు. సహజసిద్ధంగా తయారు చేసిన ఈ ఫ్రాగ్రెన్స్ రకాలను పదుల సంఖ్యలో అందుబాటులో ఉంచారు. అగరబత్తీల నుంచి సాంబ్రాణీ, కార్ ఫ్రాగ్రెన్స్ వరకు అన్ని రకాల ఉత్పత్తులు వీరి వద్ద ఉన్నాయి. గోమయం, ఆవు పంచకంతో పాటు ప్రత్యేక వనమూలికలను సేకరించి వీటిని తయారు చేసినట్లు తెలిపారు. అగరబత్తీ, సాంబ్రాణీ ప్యాకెట్లు రూ.50 కు విక్రయిస్తుండగా.. కార్ ఫ్రాగ్రెన్స్, రూమ్ ఫ్రాగ్రెన్స్ ధరలు రూ.80 నుంచి రూ.150 వరకు ఉన్నాయి.

ఎంపీ తనూజరాణికి త్రుటిలో తప్పిన ప్రమాదం

- తేలికపాటి గాయాలతో విశ్రాంతి


విశ్రాంతి తీసుకుంటున్న ఎంపీ తనూజారాణి

సాక్షి,పాడేరు: అరకు పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ గుమ్మా తనూజరాణికి త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది.కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచడాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ గురువారం చేపట్టిన పోరుబాట ఆందోళన కార్యక్రమానికి వెళ్లేందుకు ఇంటి నుంచి మెట్లు దిగుతున్న సమయంలో ఎంపీ ఒక్కసారిగా జారి పడ్డారు. ఆ సమయంలో ఆమె భర్త చెట్టి వినయ్, కుటుంబ సభ్యులు ఎంపీకి సపర్యలు చేశారు.తేలిక పాటి గాయాలతో పెద్ద ప్రమాదం నుంచి ఎంపీ తనూజారాణి బయటపడ్డారు. ప్రాథమిక వైద్య సేవలు పొంది, తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు.

సొంత భవనాలు నిర్మించండి


గ్రామ సమస్యలపై తహసీల్దార్ సూర్యారావుకి వినతిపత్రం ఇస్తున్న రత్నకుమారి

అడ్డతీగల: గొండోలులో మండల పరిషత్ పాఠశాలతో పాటు అంగన్‌వాడీ సెంటర్ రెండూ అద్దె భవనాల్లో కొనసాగుతోందని, సొంత భవనాలు నిర్మించాలని టీడీపీ అడ్డతీగల మండల మహిళా అధ్యక్షురాలు వై.రత్నకుమారి కోరారు. ఈ మేరకు గొండోలులో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న తహసీల్దార్ కొమరం సూర్యారావుని కలిసి వినతిపత్రం అందజేశారు. చాలా కాలంగా ఇదే పరిస్థితి తమ గ్రామంలో ఉందన్నారు. తాగునీటి సరఫరా కోసం ట్యాంక్ నిర్మించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో సీసీ రోడ్లు నిర్మించాలన్నారు. తగిన పరిశీలన జరిపి ప్రజలకు అవసరమైన ఆయా పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళి


మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు,మాజీ ఎంపీ మాధవి, మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, నాయకులు


అరకులోయలో మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపం ప్రకటిస్తున్న అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం, ఎమ్మెల్సీ రవిబాబు, జిల్లా చైర్‌పర్సన్ సుభద్ర తదితరులు

సాక్షి,పాడేరు: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు తదితరులు సంతాపం తెలిపారు. తన క్యాంపు కార్యాలయంలో మాజీ ప్రధాని చిత్రపటం వద్ద ఎమ్మెల్యేతో పాటు మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి,మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కొద్ది సేపు మౌనం పాటించారు.దేశానికి ప్రధానిగా మన్మోహన్‌సింగ్ చేసిన సేవలను వారంతా గుర్తుచేసుకున్నారు. కొయ్యూరు, జీకే వీధి ఎంపీపీలు రమేష్,కుమారి,జెడ్పీటీసీ కిముడు శివరత్నం, పార్టీ జిల్లామహిళా విభాగం అధ్యక్షురాలు కురుసా పార్వతమ్మ,ఎంపీటీసీలు,సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

అరకులోయటౌన్: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి అరకులోయ ఎమ్మెల్యే మత్స్యలింగం, ఎమ్మెల్సీ రవిబాబు, ఉమ్మడి విశాఖ జిల్లా చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు సంతాపం తెలిపారు.
మాజీ ప్రధాని చిత్ర పటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు, మన్మోహన్ సింగ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సందడి కొండబాబు, శెట్టి వెంకటరావు, భూర్జ సుందర్‌రావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్

ముంచంగిపుట్టు: కూటమి ప్రభుత్వం వలంటీర్లకు ఇచ్చిన ఎన్నికల హామీని వెంటనే నెరవేర్చాలని సీఐటీయూ మండల కార్యదర్శి కె.శంకర్‌రావు అన్నారు. మండల కేంద్రంలో సీటూ ఆధ్వర్యంలో జరుగుతున్న వలంటీర్ల దీక్షలు శుక్రవారం రెండోవ రోజు కొనసాగాయి. కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి, తమకు న్యాయం చేయాలని వలంటీర్లు పలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి నుంచి ఇప్పటివరకు ఉన్న బకాయిపడ్డ జీతాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. వలంటీర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. దేవా, లక్ష్మీపురం సర్పంచ్ త్రినాథ్, సిఐటియూ నేతలు, వలంటీర్లు పాల్గొన్నారు.

హుకుంపేట: గ్రామ వలంటీర్లను విధుల్లో చేర్చుకోవాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తాపుల కృష్ణారావు, గ్రామ వలంటీర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బర్లు కొండబాబులు అన్నారు. మండల కేంద్రంలో డా.బిఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద రిలే నిరహార దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి సీఐటియు, గిరిజన సంఘం మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా కృష్ణారావు, కొండబాబులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గ్రామ వలంటీర్లకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. ప్రభుత్వం రాగానే వలంటీర్లకు రూ.10వేలు జీతం ఇస్తూ వ్యవస్థ కొనసాగిస్తామని చెప్పిన మాటలు నిలబెట్టుకోవాలన్నారు. గ్రామ వలంటీర్ల సంఘం నాయకులు లక్ష్మణ్, శంకర్ పాల్గొన్నారు.

జి.మాడుగుల: గ్రామ వలంటీర్లను విధుల్లో తీసుకొని ఉద్యోగ భద్రత కల్పించాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సాగిన ధర్మన్నపడాల్, సీఐటీయూ మండల కార్యదర్శి దీనబంధు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గల పాత పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ వలంటీర్ల యూనియన్ రెండు రోజులపాటు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. వారు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో తక్కువ గౌరవ వేతనంతో ప్రభుత్వ పథకాలు చేరవేసి ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పనిచేశారన్నారు. ఎన్నికల మెనిఫెస్టోలో హామీ ఇచ్చి అధికారంలోని వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా రోజుకోక మాట చెప్పి, వలంటీర్లను మోసం చేయటం కూటమి ప్రభుత్వానికి తగదన్నారు. ఏడు నెలల బకాయిలు చెల్లించటానికి తక్షణమే ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సురభం గి రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు సన్యాసిదొర, చిన్నారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దతు తెలియజేశారు. శోభన్‌రావు, చిన్నారావు, నాయకులు తిరుపతిరావు, చంటిబాబు, కొండబాబు, వెంకట్, రఘురామాచారి, అప్పారావు, సింహాచలం, దేవుడమ్మ, సతీష్, రాధమ్మ, చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలు

ఏపీవోకు మెమో ఇచ్చిన ఎంపీడీవో

రాజవొమ్మంగి : స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో గల ఉపాధి హామీ కార్యాలయంలో శుక్రవారం క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఎంపీడీవో, వెలుగు తదితర కార్యాలయాలకు చెందిన అధికారులు హాజరై ప్రసంగించారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుక జరుపుకొన్నారు. కాగా క్రిస్మస్ వేడుక పేరుతో కార్యాలయం వద్ద మతపరమైన భక్తి గేయాలు ఆలపించడం వివాదస్పదమైంది. దీంతో ప్రభుత్వ కార్యాలయంలో ఓ మతానికి చెందిన కార్యక్రమాలు నిర్వహించడం ఏంటని, వివరణ ఇవ్వాలని స్థానిక ఎంపీడీవో యాదగిరీశ్వరరావు ఉపాధి ఏపీవో వందే సురేష్‌కుమార్‌కు మెమో జారీ చేశారు. దీనిపై ఎంపీడీవో యాదగిరీశ్వరరావును సాక్షి వివరణ కోరగా సాధారణ సమావేశం అని తాము కూడా వెళ్లామని, మతానికి సంబంధించిన కార్యక్రమమని విమర్శలు రావడంతో ఏపీవోకు మెమో జారీ చేశామని చెప్పారు.

అప్పన్న అన్నప్రసాదానికి రూ.2 లక్షల విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి సింహాచలం దేవస్థానం మాజీ ట్రస్ట్‌బోర్డు సభ్యుడు, నగరంలోని మధురవాడకు చెందిన పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు 2 లక్షల 116 రూపాయల విరాళాన్ని శుక్రవారం అందించారు. సింహగిరికి వచ్చిన దాత సంబంధిత విరాళాన్ని చెక్కు రూపంలో ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్‌కు ఇచ్చారు. దేవస్థానం తరఫున దాతకు శేషవస్త్రం, ప్రసాదాన్ని అధికారులు అందించారు.

మద్యం మత్తులో గిరిజనుడి మృతి


మృతి చెందిన గిరిజనుడు ముర్వల రమేష్

చింతపల్లి: మద్యం మత్తులో అన్నవరం వారపు సంతలో ముర్వల రమేష్ (40) అనే గిరిజనుడు గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుని భార్య కమల కథనం మేరకు.. వారం రోజుల క్రితం లోతుగెడ్డ పంచాయతీ చోద్రాయి గ్రామంలో బంధువు మృతి చెందడంతో కొయ్యూరు మండలం బూదరాళ్ల పంచాయతీ కిండంగి గ్రామం నుంచి అంత్యక్రియలకు వచ్చాడు. కొన్ని రోజులు ఇక్కడే గడిపి గురువారం స్వగ్రామం కిండంగికి బయలుదేరాడు. మద్యం సేవించి అన్నవరం వారపు సంతలో పడి ఉన్నాడని చోద్రాయి గ్రామస్తులకు సమాచారం అందించగా, వారు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మృతునికి భార్య ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు అన్నవరం ఎస్‌ఐ వీరబాబు తెలిపారు.

కాఫీ రైతులూ... దళారులను నమ్మవద్దు


చింతపల్లి కాఫీ పల్పింగ్ యూనిట్‌లో కాఫీ పప్పును పరిశీలిస్తున్న పీవో అభిషేక్


నక్కలమెట్టలో ఉపాధి పథకం వివరాలను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

చింతపల్లి: దళారులను నమ్మి మోసపోవద్దని కాఫీ రైతులకు పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ సూచించారు. మండలం కేంద్రం చింతపల్లిలో గల కాఫీ పల్పింగ్ యూనిట్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే గిరిజన రైతుల నుంచి కాఫీ పండ్లను మాక్స్ సంస్థ ద్వారా ఐటీడీఏ కొనుగోలు చేస్తున్నట్టు చెప్పారు. జీసీసీ కూడా రైతులకు మంచి గిట్టుబాటు ధర కల్పిస్తోందని తెలిపారు. అధిక ధర చెల్లిస్తామని దళారులు మభ్యపెడుతూ తూనికల్లో మోసం చేస్తున్నారని, కాఫీ రైతులు గమనించాలని తెలిపారు. అనంతరం లోతుగెడ్డ పంచాయతీ పరిధిలో గల లింగాలగుడి గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో చేపడతున్న ఫారం పాండ్ పనులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఏడీజి అప్పలనాయుడు,మాక్స్ సొసైటీ అధ్యక్షుడు సెగ్గె కొండలరావు, డైరెక్టర్ మామిడి గోవిందు, ఎంపీడీవో శ్రీనివాసరావు,ఉపాధి పథకం ఏపీవో రాజుబాబు తదతరులు పాల్గొన్నారు.

లక్ష్యానికి అనుగుణంగా ఉపాధి పనులు

గూడెంకొత్తవీధి: లక్ష్యానికి అనుగుణంగా ఉపాధి పథకం పనులను పక్కాగా పూర్తిచేయాలని ఐటీడీఏ పీవో అభిషేక్ అన్నారు. మండలంలోని నక్కలమెట్ట గ్రామంలో ఉపాధి పథకం ద్వారా జరుగుతున్న పారంపాండ్స్ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు.మండలానికి వంద చొప్పున ఈపనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే 11మండలాల్లో 1100 పనులను పూర్తిచేశామన్నారు. ఏపీడీ లోకేష్‌కుమార్, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఇన్‌చార్జి ఏపీవో రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం కోసం అడిగితే అరెస్ట్ చేస్తారా

పాడేరు రూరల్: న్యాయం కోసం అడిగితే అక్రమంగా అరెస్ట్ చేస్తారా అని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల మృతి చెందిన కొయ్యూరు గురుకుల పాఠశాల విద్యార్థి మనోజ్‌కుమార్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ఎస్‌ఎఫ్ఐ నాయకులు,మృతుడు మనోజ్‌కుమార్ తల్లిదండ్రులు శాంతియుతంగా నిరసన తెలిపి, న్యాయం కోసం అడిగితే అక్రమంగా అరెస్ట్ చేయడం సరికాదన్నారు. అరెస్ట్ చేసిన వారందరినీ తక్షణం విడుదల చేయాని డిమాండ్ చేశారు. పాఠశాల నిర్వాహకుల నిర్లక్ష్యంతోనే విద్యార్థి మృతి చెందాడని, ఆ తప్పును కప్పిపుచ్చుకోవడం కోసమే అధికారుల కుట్ర పన్నారని ఆరోపించారు. ఈ సంఘటనపై విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వం తక్షణమే విద్యార్థి కుటుంబానికి రూ.50లక్షల నష్టపరిహారం చెల్లించి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం కల్పించాలని కోరారు.

అరెస్టులు అప్రజాస్వామికం

రాజవొమ్మంగి: కొయ్యూరు గురుకుల పాఠశాలలో పదవ తరగతి చదువుతూ ఇటీవల మృతి చెందిన విద్యార్థి మనోజ్ కుమార్ కుటుంబానికి న్యాయం చేయమని అడిగినందుకు గిరిజన సంఘం నాయకులను శుక్రవారం పోలీసులు అరెస్టు చేయడం అప్రజాస్వామ్యం అని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సాగిన ధర్మన్న, ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు కార్తీక్, జీవన్, మృతుని తండ్రి వంతల సత్యనారాయణలను పోలీసులు ఈడ్చుకొని వెళ్లి జీపు ఎక్కించి, పోలీస్‌స్టేషన్‌లో బంధించడం బాధాకరమన్నారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడిచిపెట్టాలని, బాధిత కుటుంబానికి పరిహారంగా రూ. 50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే గురుకులాలు. ఆశ్రమ పాఠశాలల్లో తరచు జరుగుతున్న విద్యార్థుల మరణాలపై అధికారులు సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు.

ఉపాధి కోర్సుల్లో శిక్షణ

మహారాణిపేట: వన్‌టౌన్, పోర్టు పరిసర ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగ యువతకు ఉపాధి ఆధారిత కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సీఈఎంఎస్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కమోడోర్ ఎస్.గోపీకృష్ణ తెలిపారు. విశాఖపట్నం పోర్టు అథారిటీ సీఎస్సార్ నిధులతో రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఇచ్చి, ఉపాధి సహకారం అందిస్తామని ప్రకటనలో పేర్కొన్నారు. 27 ఏళ్ల లోపు వయసు గల బీటెక్ మెకానికల్ ఇంజినీరింగ్, ఐటీఐ, ఫిట్టర్, టర్నర్, ఎలక్ట్రికల్, మిషనిస్టు, వెల్డర్, డిప్లమో మెకానికల్, ఎలక్ట్రికల్, ఇంటర్, ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు సీఈఎంఎస్, సింధియా జంక్షన్‌లో ఉన్న కార్యాలయంలో లేదా 86884 11100, 83319 01237, 0891-2704010లో సంప్రదించవచ్చు.

గంజాయి కేసులో పాత ముద్దాయి అరెస్టు

అనకాపల్లి: మండలంలోని సంపతిపురంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరుకు చెందిన పైలా జయకుమార్ (35) గంజాయి కేసులో ముద్దాయిగా గుర్తించి శుక్రవారం కేసు నమోదు చేశారు. అతన్ని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి జయకుమార్‌కు 14 రోజుల రిమాండ్ విధించినట్లు రూరల్ ఎస్ఐ రవికుమార్ తెలిపారు. మూడు మాసాల క్రితం కేరళ రాష్ట్రానికి చెందిన ఇద్దరు వ్యక్తుల నుంచి 33 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. ముద్దాయిలు ఇద్దరు పాడేరుకు చెందిన పైలా జయకుమార్‌కు గంజాయి ఇచ్చినట్లు అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అప్పుడు కేరళకు చెందిన ఇద్దరు వ్యక్తులను కోర్టుకు హాజరు పరిచామని, మరో ముద్దాయి జయకుమార్ కోసం గాలించి శుక్రవారం సంపత్‌పురం గ్రామంలో పట్టుకుని కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

క్లుప్తంగా

రగ్గుల పంపిణీ



రగ్గులు పంపిణీ చేస్తున్న నాయకులు సదాశివరాజు, మాజీ ఎంపీపీ బత్తిరి రవిప్రసాద్

హుకుంపేట: మండలంలోని తడిగిరి పంచాయతీ ఏ.బొడ్డాపుట్టు గ్రామంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు మాజీ ఎంపీపీ బత్తిరి రవిప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు బాకురు సదాశివరాజు చేతుల మీదుగా 50 మంది పేదలకు రగ్గులు పంపిణీ చేశారు. ఎంపీటీసీ పరదాని సభ్యుడు భీమలింగేశ్వరరావు, సర్పంచ్ పెనుమల రంజిత్, నాయకులు రాంబాబు, సూరిబాబు, దైవసేవకులు నాగేశ్వరరావు, సూరిబాబు పాల్గొన్నారు.

శేఖర్‌కు ఘన సన్మానం



శేఖర్‌ను సన్మానిస్తున్న పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

జి.మాడుగుల: వైఎస్సార్‌సీపీ యూత్ వింగ్ ఏఎస్సార్ జిల్లా అధ్యక్షుడిగి నియామకమైన మండలానికి చెందిన గబ్బాడి శేఖర్‌ను పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు శాలువ కప్పి బొకేను అందజేసి ఘనంగా సన్మానించారు. పాడేరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అనుబంధ విభాగాల అల్లూరి జిల్లా అధ్యక్షులను ఇటీవల కేంద్ర కార్యాలయం ప్రకటించిన విషయం తెలిసిందే. మండల పార్టీ అధ్యక్షుడు సుర్మని మత్స్యకొండంనాయుడు, మాజీ సర్పంచ్ సీతారాంనాయుడు, నాయకులు మచ్చమ్మ, చిట్టిబాబు తదితరలు పాల్గొన్నారు.

రోగాలతో పశువుల మృతి



మృతి చెందిన దుక్కిటెద్దు

అరకులోయటౌన్: మండలంలోని మారుమూల ఇరగాయి పంచాయతీలో పశువులు మృత్యువాత పడుతున్నాయని, గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహించాలని సర్పంచ్ మాదల బుటికి డిమాండ్ చేశారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. గడిచిన రెండు రోజుల్లో పంచాయతీ పరిధిలోని బొర్రాకోండ, గాతపాడు గ్రామాల్లోని పాడి లక్ష్మయ్య, సింహాద్రి, బాబూరావు, సాలేపు సన్యాసిరావులకు చెందిన ఐదు దుక్కిటెద్లు వివిధ రోగాల వల్ల మృతి చెందాయన్నారు. వెంటనే పశువైద్యాధికారులు స్పందించి గ్రామాల్లో పశువైద్య శిబిరం ఏర్పాటు చేయాలన్నారు.

విద్యార్థి మనోజ్ కుటుంబానికి న్యాయం చేయాలి



గురుకుల విద్యార్థులతో మాట్లాడుతున్న రాజశేఖర్


కొయ్యూరు: స్థానిక గురుకుల పాఠశాల విద్యార్థి మనోజ్ మరణించిన నేపథ్యంలో అతని కుటుంబానికి ప్రభుత్వం సాయం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. మనోజ్ కుటుంబానికి రూ.పది లక్షల పరిహారం ఇచ్చి ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఇలా జరిగిందని ఆయన విమర్శించారు. ఉపాధ్యాయులు సమ్మెలో ఉండడంతో బోధన కుంటుపడుతుందన్నారు. ఒకప్పుడు గురుకుల పాఠశాలలు కార్పొరేట్ స్థాయిలో ఉంటే నేడు దానికి భిన్నంగా ఉందన్నారు.

ఎస్ఐగా వెంకటరావు బాధ్యతల స్వీకరణ



రంపచోడవరం: రంపచోడవరం ఎస్ఐగా వి.వెంకట్రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నుంచి ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు రంపచోడవరం ఎస్ఐగా పనిచేసిన సాదిక్ మారేడుమిల్లి బదిలీ అయ్యారు.

విద్యుత్ చార్జీల పెంపుపై జనాగ్రహం



వైఎస్సార్‌సీపీ పోరుబాటకు తరలివచ్చిన ప్రజానీకం



హుకుంపేటలో నిరసన ర్యాలీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాడేరు/అరకులోయ టౌన్/రంపచోడవరం: విద్యుత్ చార్జీల పెంపుపై జనాగ్రహం పెల్లుబికింది. వైఎస్సార్‌సీపీ చేపట్టిన పోరుబాటలో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజానీకం నినదించింది. అనూహ్యంగా విద్యుత్ చార్జీలు పెంచి తమ నడ్డి విరచొద్దంటూ ఏకరువు పెట్టింది. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు పాడేరు, అరకులోయ, రంపచోడవరం నియోజకవర్గ కేంద్రాల్లో కరెంటు చార్జీల బాదుడుపై 'వైఎస్సార్‌సీపీ పోరుబాట' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆందోళనకు నియోజకవర్గ ప్రజలు, వ్యాపారులు, రైతులు, యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. తొలుత భారీ ర్యాలీ నిర్వహించారు. మహానేత వైఎస్సార్ విగ్రహం వద్ద పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే రద్దు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, నాయకులు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలు తగ్గిస్తామని చెప్పి గద్దెనెక్కిన చంద్రబాబునాయుడు వాటిని పెంచడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన ఆర్నెల్లలోనే చంద్రబాబు రెండుసార్లు భారీగా విద్యుత్ చార్జీల భారం మోపి ప్రజలను మోసం చేశారని నాయకులు ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రజలను మోసాలు చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తన 40 ఏళ్ల రాజకీయ చరిత్రలో ఆరితేరి పోయారన్నారు. ఒక్క పైసా కూడా విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పి.. ఇప్పుడు ఎడాపెడా పెంచడం దారుణమన్నారు. మాయమాటలతో గద్దెనెక్కిన సీఎం చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పథకాల్లో ఏ ఒక్కటీ అమలు చేయకపోగా, విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల నడ్డి విరిచారన్నారు. ఇప్పటికే విద్యుత్ చార్జీలు పెంచి కోట్లాది రూపాయలను ప్రజల్ని నుంచి వసూలు చేయగా, మరోసారి మరిన్ని కోట్లు ప్రజల నుంచి వసూలు చేయాలని కుయుక్తులు పన్నారన్నారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని.. విని యోగదారులే విద్యుత్ ద్వారా సంపద సృష్టించేలా చేస్తానంటూ ప్రగల్భాలు పలికిన చంద్రబాబు ప్రజలను నిండా ముంచేశారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు పోరుబాట కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రతి గ్రామంలో బెల్ట్ షాపులు తెరిచి మద్యం విచ్చలవిడిగా అమ్మించడంతో పాటు అమ్మఒడి, రైతు భరోసా లాంటి పలు పథకాలు ఎత్తేసి ప్రజల ఆగ్రహాన్ని చూస్తున్నారన్నారు. ప్రజలే సీఎం చంద్రబాబుకు తగిన గుణపాఠం చెబుతారన్నారు.

పెంచిన చార్జీలు తగ్గించాలి

హుకుంపేట: కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఆదేశాల మేరకు చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులతో పాటు ప్రజలు తరలివచ్చి మద్దతు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, ఎంపీపీ కూడా రాజుబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భారీ ర్యాలీ చేపట్టారు. విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. అధికారులకు వినతిపత్రం అందజేశారు. పార్టీ జిల్లా వాణిజ్యా విభాగ జిల్లా అధ్యాక్షుడు ఒంటుబు శామ్యూల్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు పాంగి సింహాచలం, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఎం.విశ్వేశ్వరరావు, మండల పార్టీ గౌరవ అధ్యక్షుడు గండేరు చినసత్యం, మాజి జెడ్పీటీసీ కొర్ర కాసులమ్మ, సర్పంచ్‌లు సమిడ వెంకటపూర్ణిమ, దేవుడమ్మ, నాయకులు చిన్నయ్య, జన్ని సింహాచలం, లక్ష్మయ్య, సూరిబాబు, కోరాబు వెంకట్, అనిల్, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

'వైఎస్సార్‌సీపీ పోరుబాట'కు తరలివెళ్లిన నాయకులు

అడ్డతీగల: రంపచోడవరంలో వైఎస్సార్‌సీపీ చేపట్టిన విద్యుత్ చార్జీలపై పోరుబాట కార్యక్రమానికి గంగవరం మండలం నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. గంగవరం విచ్చేసిన ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మికి మండల పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. గంగవరం మండలం నుంచి బయలుదేరిన ర్యాలీని గంగవరం సెంటర్‌లో ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శి కె.ఎస్.ప్రసాద్, పార్టీ మండల ఇన్‌చార్జి సీహెచ్.రఘునాథ్, మండల కన్వీనర్ అప్పలరాజు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ యెజ్జు వెంకటేశ్వరరావు, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు ప్రభాకర్, ఎంపీటీసీ సభ్యుడు వెంకటలక్ష్మి, సర్పంచ్‌లు మరిడమ్మ, రామలక్ష్మి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పాడేరులోని ర్యాలీలో పాల్గొన్న పాడురు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, మాజీ ఎంపీ మాధవి, పాడేరు మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తదితరులు



గంగవరంలోని ర్యాలీలో ఎమ్మెల్సీ అనంతబాబు, మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మిని కలిసిన పార్టీ శ్రేణులు

ప్రజా సంపద కొల్లగొడుతున్న కూటమి ప్రభుత్వం



సంపద సృష్టిస్తానన్న చంద్రబాబు అధికారం వచ్చిన తరువాత ప్రజల సంపద కొల్లగొడుతున్నారు. కరెంట్ చార్జీలు పెంచడం వలన సామాన్యులపై తీవ్ర భారం పడుతుంది. పెంచిన కరెంటు చార్జీలు వెంటనే తగ్గించి, ఎన్నికల హామీలు నెరవేర్చాలి. లేకుంటే ప్రజలు కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చెబుతారు. – లోక్కోయి లక్ష్మణ్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు, అరకులోయ

హామీలు నెరవేర్చాలి



కూటమి నేతలు ఎన్నికల హామీలను వెంటనే నెరవేర్చాలి. అధికారంలో వచ్చేందుకు అమలు చేయలేని హామీలు గుప్పించి తీరా అధికారంలోకి వచ్చిన తరువాత హామీలు నెరవేర్చకపోవడం దారుణం. పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలి

– గెడ్డం నర్సింగరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు, అరకులోయ

సామాన్యులపై ఆర్థిక భారం



ప్రజలకు ఇచ్చిన మాటను చంద్రబాబు పూర్తిగా విస్మరించారు. ఎన్నికల హామీలు అమలు చేయకుండా విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోంది. ఆరు నెలల్లో రెండు సార్లు విద్యుత్ చార్జీలను పెంచి సామాన్యులపై ఆర్థిక భారం మోపింది. కూటమి ప్రభుత్వానికి ప్రజాగ్రహం తప్పదు.

– భువనేశ్వరావు, వంట్లమామిడి గ్రామం, పాడేరు మండలం

ఉచిత విద్యుత్ కొనసాగించాలి



అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలు పైసా పెంచమని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రెండు సార్లు విద్యుత్ చార్జీలు పెంచడం దారుణం. ఎస్సీ, ఎస్టీలకు జగనన్న ప్రభుత్వంలో 200 యూనిట్‌ల వరకు ఉచితంగా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం దానిని కొనసాగించాలి.

– శెట్టి రోషిణి, జెడ్పీటీసీ, అరకులోయ

హామీలు విస్మరించిన చంద్రబాబు



ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం మరచింది. చంద్రబాబు అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే రెండుసార్లు భారీగా విద్యుత్‌చార్జీలు పెంచి సామాన్యుల నడ్డి విరిచారు. ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూటమి ప్రభుత్వం అమలుచేయకుండా ప్రజలను మోసం చేస్తోంది.

– వంతల నాన్నిబాబు, సరియపల్లి గ్రామం, పాడేరు మండలం

మన్మోహన్‌సింగ్ సేవలు మరువలేనివి



మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

ముంచంగిపుట్టు: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ హఠార్మరణంతో మండల కాంగ్రెస్ నేతలు తీవ్ర విచారణ వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మౌనం పాటించారు. ఈ సందర్భంగా దార్రెల ఎంపీటీసీ సభ్యుడు, కాంగ్రెసు నేత మల్లికార్జున్ మాట్లాడుతూ ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు, మానవాతవాది మన్మోహన్‌సింగ్ అని ఆయన అన్నారు. నేతలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

డుంబ్రిగుడ: మండలంలోని పోతంగి పంచాయతీ పెద్దపాడు, కోసంగి గ్రామాల్లో పోతంగి వైస్ సర్పంచ్ జగ్గనాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ కోటేశ్వరరావు మాట్లాడుతూ సదస్సుల్లో భూ సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోసంగి, పెద్దపాడు గ్రామస్తులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

యూటీఎఫ్ సభల పోస్టర్ ఆవిష్కరణ



మహాసభల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ముంచంగిపుట్టు: యూటీఎఫ్ విద్యా వైజ్ఞానిక మహాసభలు జనవరి 5 నుంచి ప్రారంభమవుతాయని జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ధర్మారావు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం యూటీఎఫ్ మహాసభల కరపత్రాలు, పోస్టర్లను నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధర్మారావు మాట్లాడుతూ జనవరి 5 నుంచి 8వ తేదీ వరకు మహాసభలు కాకినాడ పి.ఆర్ కాలేజీలో జరుగుతున్నాయన్నారు. సభల్లో ఫెడరేషన్ యొక్క భవిష్యత్తు కార్యచరణ ప్రకటించనున్నట్టు తెలిపారు.ఈ కార్యక్రమానికి యూటీఎఫ్ నాయకులంతా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. నేతలు రాజు, గోపి, ధనుపతి, పుండరీ, అప్పలనాయుడు, రాధాకృష్ణ, పరశురాం, శ్రీనివాసు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



చింతపల్లి డిగ్రీ కళాశాలలో బోరు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ బాలయ్యపడాల్



కొళాయి ద్వారా నీటిని పడుతున్న సర్పంచ్, ముత్యాలమ్మ, మహిళలు



పాములరాయిలో బోరు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ బేసు, ఎంపిటీసీ కొర్ర నాగరాజు

చింతపల్లి: చింతపల్లి డిగ్రీ కళాశాలలో బాలుర వసతి గృహంలో మంచినీటి బోరు నిర్మాణ పనులను ఎంపీపీ కోరాబు అనూషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య పడాల్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో అనుబంధ బాలుర వసతి గృహం వార్డెన్ గసాడి తిరుపతిరావు పాడేరులో స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఎంపీపీ బోరు నిర్మాణానికి మండల పరిషత్ నిధులను కేటాయించారు. దీంతో శుక్రవారం ఆ బోరు నిర్మాణానికి ప్రారంభం కార్యక్రమం చేపట్టారు. బాలికల వసతి గృహం వార్డెన్ వినాయకరావు, కళాశాల అధ్యాపకులు జగదీష్, రవీంద్రనాయక్, నాగేంద్రబాబు, శ్రీనివాసరాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పథకాలు ప్రారంభం

కొయ్యూరు: మండలంఓలని సాకులపాలెం, బొడ్డుమామిడిలో నవ నిర్మాణ సమితి ఆధ్వర్యంలో నిర్మించిన తాగునీటి పథకాలను సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ, వార్డు సభ్యులు సంజీవ్ శుక్ర వారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. ఇందు లో నవ నిర్మాణ సమితి మేనేజర్ కె.రవికుమార్, టెక్నికల్ డైరెక్టర్ వేణుగోపాల్, జూనియర్ ఇంజినీర్ బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలోని తీగలవలస పంచాయతీ పాములరాయిలో సర్పంచ్ పాంగి బేసు, ఎంపీటీసీ సభ్యుడు కొర్ర నాగరాజు బోరు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వారు మాట్లాడుతు పంచాయతీలో తాగునీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి తాగునీటి పథకాలు మంజూరు చేసినట్టు చెప్పారు. పాములరాయిలో రూ.4లక్షల వ్యయంతో బోరు నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు. వార్డు సభ్యుడు శంకర్‌రావు, త్రినాథరావు, భీమరాజు, చందు, పెంటన్న తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ రమేష్

ముంచంగిపుట్టు: రోడ్డు పనుల్లో కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సర్పంచ్ రమేష్ అన్నారు. మండలంలో గల సుజనకోట పంచాయతీ కుమ్మరిపుట్టులో జరుగుతున్న రోడ్డు, కల్వర్టు నిర్మాణ పనులను సర్పంచ్ రమేష్ శుక్రవారం పరిశీలించారు. నాణ్యతగా పనులు చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. రహదారి పనులు మొదలు పెట్టి ,అసంపూర్తిగా వదిలేయడం వల్ల కుమ్మరిపుట్టు గ్రామ గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వేగంగా నిర్మాణం పూర్తి చేసి, రవాణా కష్టాలు తీర్చాలన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు, స్థానికులు పాల్గొన్నారు.

పీసా కమిటీ ఎన్నికల నిర్వహణపై శిక్షణ



అనంతగిరిలో సూచనలిస్తున్న అధికారులు



చింతపల్లిలో మాట్లాడుతున్న అధికారులు



జీకే వీధిలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు



ముంచంగిపుట్టులో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీసాయిహర్ష

అనంతగిరి(అరకులోయటౌన్): మండలంలో పీసా గ్రామసభ ఎన్నికల నిర్వహణపై మండల పరిషత్ కార్యాయంలో హెచ్‌ఎంలు, కార్యదర్శులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్టు ఎంపీడీవో కుమార్ శుక్రవారం తెలిపారు. పీసా కమిటీ నిర్వహణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై హెచ్‌ఎంలు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. 2025 జనవరి 3 నుంచి 7వ తేదీ వరకు ఈ ఎన్నికలు నిర్వహిస్తామని ఎంపీడీవో కుమార్ తెలిపారు.

చింతపల్లి: పీసా కమిటీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పీసా కమిటీ ఎన్నికల అధికారి కంటా జాహ్నవి, ఎంఈవో ప్రసాద్‌లు ప్రిసైడింగ్ అధికారులకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. జనవరి 3,4 తేదీల్లో జరిగే ఈ ఎన్నికల్లో పీసా కమిటీలకు ఉపాధ్యక్షుడు కార్యదర్శులకు ఎన్నికలు జరుగుతాయన్నారు. ఎటువంటి విమర్శలకూ తావు లేకుండా అధికారులు తగిన ఏర్పాట్లు, జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు కోరారు.

గూడెంకొత్తవీధి: జనవరిలో జరగనున్న పీసా కమిటీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని గూడెంకొత్తవీధి ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పీసా కమిటీ ఎన్నికలకు సంబంధించి అధికారులకు శుక్రవారం శిక్షణ జరిగింది. పరిపాలనాధికారి ఇమ్మానుయేల్, డీటీ సీతారాం తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో పీసా ఎన్నికల నిర్వహణపై శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీసాయిహర్ష మాట్లాడుతూ ఇబ్బందులు లేకుండా పీసా ఎన్నికలు జరిగే విధంగా చూస్తామన్నారు. మండల పీసా కమిటీ ఎన్నికల ప్రత్యేక అధికారిగా ఏటీడబ్ల్యూవో కూడా వెంకటరమణను నియమించినట్టు తెలిపారు. పీసా ఎన్నికలు సక్రమంగా జరిగే విధంగా అందరూ సహకారం అందించాలని ఆయన కోరారు. అధికారులు, హెచ్‌ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్ విశ్వనాథ్

మారేడుమిల్లి: గ్రామ సచివాలయ సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని, ప్రభుత్వ నిబంధనలు ప్రకారం సక్రమంగా విధులు నిర్వహించాలని ఎంపీడీవో తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ, సచివాలయ సిబ్బందితో సమీక్ష శుక్రవారం నిర్వహించారు. మండల ప్రగతిపై పలు సూచనలు చేశారు. ప్రభుత్వ గృహాలు నిర్మించుకుంటున్న గిరిజనులు పునాది పనులను 90 రోజులు పనిదినాలు ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. పనిచేసిన ఉపాధి వేతనదారులకు రోజుకు రూ. 300 వచ్చేలా సాంకేతిక సిబ్బంది కృషి చేయాలన్నారు. ఫారం పాండ్లు పనులు త్వరగా పూర్తిచేయాలని ఏపీవో మణిని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాలకు మంజూరైన 40 మరుగుదొడ్లను సత్వరమే నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి పాఠశాలలో మరుగుదొడ్లు శుభ్రంగా ఉన్నాయో లేదో సచివాలయ సిబ్బంది తనిఖీ చేయాలని ఆదేశించారు.

అంగన్‌వాడీ ఆయా మృతికి సంతాపం



మంగాదేవి(ఫైల్)

రాజవొమ్మంగి: అమ్మిరేఖలలో అంగన్‌వాడీ ఆయా పనిచేస్తున్న ఆశపు మంగాదేవి (55) గుండెపోటుతో మృతి చెందారు. ఆమె శుక్రవారం తీవ్ర అస్వస్థతకు గురవడంతో స్థానిక పీహెచ్‌సీకి తరలించామని, అక్కడి నుంచి వైద్యుల సిఫార్సు మేరకు కాకినాడకు తరలించేందుకు ఎర్రవరం వద్ద బస్సు ఎక్కుతుండగా ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న అంగన్‌వాడీ కార్యకర్తల యూనియన్, పోస్టల్ ఈడీ ఉద్యోగుల యూనియన్ నాయకులు గ్రామానికి వెళ్లి మంగాదేవి మృతదేహం వద్ద నివాళులర్పించి, మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంగన్‌వాడీ సహచర సిబ్బంది, తదితరులు సంతాపం తెలిపారు.